

అలరించిన కళాఉత్సవ్ పోటీలు

జిల్లా విద్యాశిక్షణ సంస్థలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి కళాఉత్సవ్ పోటీల్లో విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి. - 8లో



ఇంతి..కోటి దీప కాంతి

పుత్తూరులో సోమవారం జరిగిన కార్తీక దీపోత్సవంలో మహిళలు వెలిగించిన కార్తీక జ్యోతి ఆధ్యాత్మిక దీప్తిగా పరిఢవిల్లింది. - 8లో



లా నేస్తం.. విజయ చిహ్నం

వైఎస్సార్ లా నేస్తం పథకం యువ న్యాయవాదులకు తొలి మూడేళ్లు ఊతమిస్తోందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

తుపాను ప్రభావిత ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రి రోజా



తూము లీకేజీని పరిశీలిస్తున్న మంత్రి ఆర్కేరోజా

నగరి : తుపాను ప్రభావిత ప్రాంతాలైన గుండ్రాజుకుప్పం, గుండ్రాజుకుప్పం దళితవాడ గ్రామాలను మంత్రి ఆర్కేరోజా సోమవారం పరిశీలించారు. తుపాను తాకిడికి గుండ్రాజుకుప్పం చెరువు తూము పాక్షికంగా దెబ్బతినడంతో నీరు లీకేజీ అవుతుండడాన్ని పరిశీలించి, తూముకు వెంటనే మరమ్మతులు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. మరోసారి తుపాను వచ్చే అవకాశం ఉందంటూ సమాచారం వస్తున్నందున చెరువు కట్టలు, తూములను పరిశీలించి వాటిని పటిష్టం చేయాలన్నారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా తుపాను బాధిత ప్రాంతాల్లో ఇప్పటికే తన చారిటబుల్ ట్రస్టు ద్వారా అత్యవసర సాయం అందజేశామన్నారు. ఛిద్రమైన రోడ్లను యుద్ధప్రాతిపదికన బాగు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ శివారెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మురళీకుమార్, అసిస్టెంట్ ఇంజినీర్ రాజగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, సర్పంచ్ బాలప్రసాద్, నాయకులు గోవర్ధన్, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'కు ఏర్పాట్లు పూర్తి చేయండి



ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : ఆడుదాం ఆంధ్ర పోటీలకు ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా ఆడుదాం ఆంధ్ర పోటీలు ప్రారంభం కానున్నాయని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడలకు ప్రభుత్వం సరఫరా చేసిన క్రీడావస్తువులను క్షేత్రస్థాయికి చేర్చాలన్నారు. చేర్చిన అనంతరం సంతకాలతో కూడిన రశీదులను సేకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. కాగా ఎన్నికల ఓటర్ల జాబితా కసరత్తులో నమోదైన అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. అసైన్‌మెంట్ పట్టాల పంపిణీ చేసిన ప్రాంతాల్లో ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని తహసీల్దార్లకు తెలిపారు. ఫారం 7 దరఖాస్తులను పకడ్బందీగా పరిశీలించాలని, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజలకు అండగా జగనన్న ప్రభుత్వం



సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: జగనన్న ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలకు ఎల్లప్పుడూ అండగానే ఉంటుందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. సోమవారం మండలంలోని 10 మందికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.6.57 లక్షలకు సంబంధించిన చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్యతరగతి ప్రజల పాలిట దేవుడిలా నిలుస్తూ, ఆరోగ్యశ్రీలో లేని పలు వ్యాధులకు కూడా చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. సీఎం సహాయనిధి ద్వారా జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో మంది అభాగ్యులను ఆపదలో ఆదుకుంటున్నారని చెప్పారు. ఎంపీపీ యువరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి మిషన్ ఇంద్ర ధనస్సు

చిత్తూరు రూరల్ : జిల్లాలో ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ రవిరాజు తెలిపారు. ఇందులో భాగంగా వైద్య సిబ్బంది తమ పరిధిలో వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోని, మధ్యలో ఆపేసిన గర్భిణులు, పిల్లలకు టీకాలు వేస్తామన్నారు. జిల్లాలో 488 మంది గర్భిణులు, 1,236 మంది ఏడాదిలోపు పిల్లలు, 5 ఏళ్లలోపు పిల్లలను 991 మందిని గుర్తించామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు రూరల్: రెడ్‌క్రాస్ సొసైటీలో ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని సొసైటీ కార్యదర్శి సహదేవనాయుడు తెలిపారు. స్టాఫ్‌నర్సు పోస్టుకు బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి కంప్యూటర్ అనుభవం ఉండాలన్నారు. ల్యాబ్ టెక్నీషియన్‌కు డీఎంఎల్‌టీ, సహాయక పోస్టుకు పదో తరగతి పాసైనా అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులను పూర్తి చేసి చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో ఈనెల 18వ తేదీ లోపు సమర్పించాలని ఆయన పేర్కొన్నారు.

వైవిద్యాలయం

నీకు వందనం

బడిలో..గుడిలో.. అక్షర మడిలో.. వెతల జడిలో..వెలుగుల కాగడా.. మూసపద్ధతిపై కొరడా.. వైవిద్య సవ్వడి.. వెరసి.. బాలికల్లో చదువుల ఒరవడి. విద్యావ్యవస్థలో నూతన ఒరవడులకు శ్రీకారం చుడుతోంది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సర్కారు స్కూళ్లలో ఆంగ్లమాధ్యమం, హైస్కూలు ప్లస్ తదితర విధానాలను అమలు చేసింది. ఈ విధానాలు సఫలీకృతం కావడంతో పేద విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ చేకూరుతోంది. వైవిధ్యమైన హైస్కూలు ప్లస్ విజయవంతంపై ప్రత్యేక కథనం.

- బాలికలకు ప్రత్యేకంగా ఇంటర్ విద్య
- సత్ఫలితాలనిస్తున్న ప్రభుత్వ నిర్ణయం
- సొంతూరిలోనే బాలికలకు ఇంటర్ విద్య



ఎం.బందపల్లె హైస్కూల్ ప్లస్ పాఠశాలలో ఇంటర్ తరగతులు బోధిస్తున్న అధ్యాపకురాలు

చిత్తూరు కలెక్టరేట్ : హైస్కూల్ ప్లస్ విధానంలో బాలికలకు ఉన్న ఊళ్లల్లోనే ఇంటర్మీడియట్ విద్యను అందిచాలన్నది రాష్ట్ర ప్రభుత్వం ఆశయం. ఇందుకు అనుగుణంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 35 ఉన్నత పాఠశాలలను గుర్తించి హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేసింది. 2022–23 విద్యాసంవత్సరంలో ఈ విధానాన్ని అమలు చేసింది. సంబంధిత పాఠశాలల్లో ఇంటర్ విద్యకు అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులను ప్రవేశపెట్టింది. ఆ గ్రూపుల బోధనకు అధ్యాపకులను సైతం నియమించింది. ఆయా కోర్సుల విద్యార్థులకు ప్రభుత్వమే ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అందజేసింది. ఫలితంగా ఆ పాఠశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం 489 మంది, ద్వితీయ సంవత్సరం 536 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలతో బాల్య వివాహాలు, పదో తరగతి పూర్తవగానే పెళ్లిళ్లు చేసి అత్తారింటికి పంపడం వంటి వాటికి ఫుల్‌స్టాప్ పడింది. మరోవైపు ఇంకో రెండేళ్ల పాటు చదువుకునే అవకాశం దక్కుతోందని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఆనందిస్తున్నారు.

గత పాలనలో దయనీయం

'బాలికల చదువు భవితకు వెలుగు' అన్నది నానుడి. ఇందుకు అనుగుణంగా ప్రస్తుతం పలువురు తల్లిదండ్రులు బాలికల చదువుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే అనేక గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో మాత్రం ఈ పరిస్థితి ఉండడం లేదు. నిర్దీత విద్యాభ్యాసం పూర్తయితే చాలు.. అత్తారింటికి పంపించి, తమ బరువు, బాధ్యతలు దించుకుందామనే ఆలోచనలో ఉంటారు. దీనికి అంతంత మాత్రంగా ఉండే కుటుంబ ఆర్థిక పరిస్థితి, ఆడపిల్లకు చదువెందుకనే ధోరణి, తమ గ్రామానికి కళాశాలలు దూరంగా ఉండడం, కళాశాలకు వెళ్లి వచ్చేటప్పుడు ఏవైనా దుర్ఘటనలు చోటు చేసుకుంటే గ్రామంలో తలెత్తుకోలేమనే భయం.. ఇలా అనేక కారణాలున్నాయి. కొన్ని గ్రామల్లో పదో తరగతి చదివితే చాలు.. ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసే దయనీయ పరిస్థితులున్నాయి. మరికొంత మంది చదువు మాన్పించి, టైలరింగ్, కూలి తదితర పనులకు పంపించి, వరుడు దొరికితే వివాహాలు చేసేవారు. దీంతో పదో తరగతి చదువుకున్నా ఆ అమ్మాయికి ఎటువంటి ఉపయోగమూ ఉండేది కాదు.

మార్పు వచ్చింది

ఉన్న ఊళ్లోనే ఇంటర్ విద్యను అందుబాటులోకి తీసుకువస్తే ఈ పరిస్థితి మారుతుందని ప్రభుత్వం భావించింది. పదో తరగతి పూర్తయిన వెంటనే అదే పాఠశాలలో ఇంటర్ రెండో సంవత్సరం వరకూ చదువుకునే వెసులుబాటు కల్పించింది. అవసరమైన అన్ని వసతులూ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇంటర్ చదివేందుకు ఉన్న ఊరు దాటి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకపోవడంతో ప్రభుత్వం భావించినట్టుగానే తల్లిదండ్రుల ఆలోచనా ధోరణిలో మార్పు వచ్చింది. గ్రామంలోనే కళాశాల ఉండడంతో తమ కుమార్తెలను మరో రెండేళ్ల పాటు ఇంటర్ చదివించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇంటర్ పూర్తయ్యాక 'ఇంత చదువు చదివింది కదా.. మధ్యలో ఆపడం ఎందుక'ని డిగ్రీ చదివేందుకు కూడా అడ్డు చెప్పడం లేదు. ఫలితంగా ఇంజినీరింగ్ వంటి ఉన్న విద్యను అభ్యసిస్తున్న బాలికలు ఉద్యోగాలు సైతం పొందుతున్నారు. అనంతరం కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవడమే కాకుండా విద్యావంతులుగా రాణిస్తున్నారు. ఫలితంగా వారికి ఆర్థి స్వాతంత్ర్యం లభిస్తోంది. ఈ పరిణామం జిల్లా వ్యాప్తంగా తల్లిదండ్రులు, విద్యార్థినులు, విద్యావేత్తల్లో ఆనందం నింపుతోంది.

తిరుపతి జిల్లాలోని పిచ్చాటూరు జెడ్పీ హైస్కూల్‌ను గత విద్యాసంవత్సరంలో హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేసి ఇంటర్మీడియట్ విద్యను ప్రవేశ పెట్టి, ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. గతంలో ఆ మండలంలో బాలికల ప్రభుత్వ కళాశాలకు వెళ్లాలంటే 25 కిలో మీటర్ల దూరంలోని నగరి, పుత్తూరుకు వెళ్లాల్సి వచ్చేది. అంత దూరం బాలికలను పంపడం ఇష్టం లేక తల్లిదండ్రులు చదువు మాన్పించేవారు. నేడు పిచ్చాటూరు జెడ్పీ హైస్కూల్‌ను హైస్కూల్ ప్లస్ గా అప్‌గ్రేడ్ చేయడంతో బాలికల అడ్మిషన్లు గణనీయంగా పెరిగాయి.



తిరుపతి జిల్లా పిచ్చాటూరులోని జెడ్పీహైస్కూల్ ప్లస్ పాఠశాల

చిత్తూరు జిల్లాలోని పూతలపట్టు మండలంలోని ఎం.బండపల్లె జెడ్పీ హైస్కూల్‌ను హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేశారు. ఇంటర్ చదవాలంటే గతంలో ఆ గ్రామం నుంచి చిత్తూరు, పూతలపట్టు మండల కేంద్రానికి విద్యార్థినులు వెళ్లాల్సిన పరిస్థితి. దూరాభారం అమ్మాయిలను పంపడం ఇష్టం లేని తల్లిదండ్రులు పదితో చదువు మాన్పించి, పెళ్లిళ్లు చేసేవారు. ఎం.బండపల్లి జెడ్పీ హైస్కూల్‌లో హైస్కూల్ ప్లస్ చేయడంతో పలువురు తమ కుమార్తెలను ఆ పాఠశాలలోనే ఇంటర్ చదివిస్తున్నారు.



చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలోని ఎం.బండపల్లె హైస్కూల్ ప్లస్

ఉమ్మడి చిత్తూరు జిల్లా సమాచారం

హైస్కూల్ ప్లస్ పాఠశాలలు	35
ఎంపీసీ గ్రూపులో బాలికలు	396
బైపీసీ గ్రూపు చదువుతున్న వారి సంఖ్య	315
సీఈసీ చదువుతున్న బాలికలు	314
మొత్తం	1,025



చదువుకుంటున్న విద్యార్థినులు

ప్రభుత్వ ఆశయం నెరవేరింది



జిల్లాలోని పలు ప్రాంతాల్లో గతంలో పదో తరగతి పూర్తి కాగానే బాలికలకు పెళ్లిళ్లు చేసేసేవారు. ఆడపిల్ల కదా దూరాభారం చదువుకు ఎందుకు పంపేది అనే ధోరణి కొంత మంది తల్లిదండ్రుల్లో ఉండేది. ప్రభుత్వం హైస్కూళ్లను అప్‌గ్రేడ్ చేసి హైస్కూల్ ప్లస్‌లను ఏర్పాటు చేయడంతో గ్రామాల్లో మార్పు వచ్చింది. హైస్కూల్ ప్లస్‌పై వేసవి సెలవుల్లో విస్తృతంగా క్షేత్రస్థాయిలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాం. దీంతో అడ్మిషన్లు పెరిగాయి. ఈ విధానంతో రాష్ట్ర ప్రభుత్వ ఆశయం నెరవేరింది. - విజయేంద్రరావు, డీఈఓ, చిత్తూరు

ధోరణి మారింది



గతంలో పదో తరగతి పూర్తయ్యిందంటే చాలు అమ్మాయిలకు పెళ్లి సంబంధాలు వెతికేవారు. రాష్ట్ర ప్రభుత్వం హైస్కూల్ ప్లస్ విద్యను ప్రారంభించాక తల్లిదండ్రుల ఆలోచన ధోరణిలో మార్పు వచ్చింది. అంత త్వరగా పెళ్లిళ్లు చేయడం ఎందుకని ఆలోచించడం మొదలుపెట్టారు. గ్రామంలోనే కళాశాల ఉంది కదా ఇంటర్ వరకు చదివించి ఆ తర్వాత ఉన్నత చదువులు చదివిద్దాం అని అనడం మొదలుపెట్టారు. - శేఖర్, డీఈఓ, తిరుపతి జిల్లా

ఎంతో ఉపయోగం



పదో తరగతి తర్వాత మమ్మల్ని బయటకు పంపాలంటే తల్లిదండ్రులు భయపడేవారు. ఇంటర్ చదవాలంటే దూర ప్రాంతం వెళ్లాల్సిందే. రోజూ వెళ్లి రావాలంటే రూ.100 ఖర్చవుతుంది. ఆర్థిక భారంతో పాటు, ఆడపిల్లనే భయంతో పదో తరగతి వరకు చాలు అని అనేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. నేను పదో తరగతి చదివిన హైస్కూల్‌లోనే ఇంటర్మీడియట్ పెట్టడంతో ఇక్కడే చేరాను. అధ్యాపకులు బాగా పాఠాలు చెబుతున్నారు. - చందు, విద్యార్థిని, ఎం.బండపల్లి, చిత్తూరు జిల్లా

శ్రమించు..లక్ష్యాన్ని ఛేదించు

- సాక్షి మీడియా గ్రూప్ -1, 2 పరీక్షల అవగాహన సదస్సుకు విశేష స్పందన
- సాధారణ తెలివితేటలతో అసాధారణ విజయాలు
- పోటీ పరీక్షలపై సివిల్స్ విజేత బాలలత సూచన



సదస్సుకు హాజరైన అభ్యర్థులు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సివిల్స్ విజేత బాలలత

తిరుపతి కల్చరల్: ప్రణాళికాబద్ధంగా శ్రమిస్తే విజయం సాధించడం సుసాధ్యమని సివిల్స్ విజేత బాలలత తెలిపారు. సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో సోమవారం తిరుపతి మహతి ఆడిటోరియంలో నిర్వహించిన గ్రూప్–1, 2 పరీక్షలపై అవగాహన సదస్సుకు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నుంచి సివిల్స్ విజేత బాలలత ముఖ్యవక్తగా హాజరై ప్రసంగించారు. ఆయా పరీక్షలకు అభ్యర్థులు ఎలా సమాయత్తం కావాలో ఆమె మార్గదర్శకం చేశారు. త్వరలో గ్రూప్స్ పరీక్షలకు నోటిఫికేషన్స్ రానున్న నేపథ్యంలో ఇప్పటినుంచే సన్నద్ధం కావాలన్నారు. సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతూ ఇష్టంగా ప్రయత్నం చేస్తే లక్ష్యాలు సులభతరమవుతాయన్నారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు సాధించాలనే ఆకాంక్షతో పాటు ఓర్పు, సహనం అవసరమని చెప్పారు. గ్రూప్స్ మాత్రమే హాజరవుతాం.. మిగిలిన పరీక్షలకు అక్కరలేదు అనే భావన నుంచి యువత బయటకు రావాలన్నారు. నోటిఫికేషన్లు వచ్చే అన్ని పరీక్షలకు అర్హుల మేనన్న ఆలోచనతో హాజరు కావాలని సూచించారు. పాఠ్యపుస్తకాలు, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పుస్తకాల ద్వారా విలువైన సమాచారాన్ని పొందవచ్చని చెప్పారు. ప్రభుత్వం ముద్రించిన ప్రచురణలు, ఆయా ప్రభుత్వ వెబ్‌సైట్‌లలో ఉన్న సమాచారాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న పథకాలపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్లు, ఆర్థిక సర్వేలపై అవగాహన పెంచుకోవాలన్నారు. నీతిఆయోగ్ వంటి సంస్థలు విడుదల చేసే సర్వేలను పరిశీలించాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇటీవల జరిగిన విపత్తులపై సైతం అవగాన కలిగి ఉండాలన్నారు. త్వరలో జరిగే ఎన్నికల సమాచారం, కేంద్ర పురస్కారాలు వంటి అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని తెలిపారు. జీవితం చాలా విలువైందని, యవ్వన దశ చాలా కీలకమని గుర్తించి ఈ దశలో అనుకున్న లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలన్నారు.


భయం వీడండి



డీవీఎస్.చక్రవర్తిరెడ్డి

ఎస్‌డీహెచ్‌ఆర్ విద్యాసంస్థల అధినేత డీవీఎస్.చక్రవర్తిరెడ్డి మాట్లాడుతూ ముందుగా భయాన్ని విడనాడి, తెలివిగా శ్రమించాలని చెప్పారు. ప్రశ్నల సరళిని అర్థం చేసుకునే నైపుణ్యం ఉంటే గెలుపు సుసాధ్యమన్నారు. సాక్షి బ్రాంచ్ మేనేజర్ బీ.సత్యేంద్రబాబు మాట్లాడుతూ ఇష్టపడి చేసే ఏపనైనా సులభతరంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సాక్షి టీవీ కరస్పాండెంట్ మూర్తి, ఈవెంట్ మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకం



సివిల్ విజేత మేడమ్ బాలలత అందించిన చక్కటి సందేశం నాకు స్ఫూర్తినిచ్చింది. జాబ్ సాధిస్తానన్న నమ్మకం కలిగింది. ఇదే స్ఫూర్తితో, పట్టుదలతో ప్రయత్నం చేస్తా. గ్రూప్–1, 2 పరీక్షల నోటిఫికేషన్‌కు ముందే సాక్షి వారు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు ఎంతో దోహదం చేసింది. సాక్షి వారికి ప్రత్యేక కృతజ్ఞతలు. - ఎం.జయంతి

ఇది లక్ష్యానికి నాంది



నోటిఫికేషన్‌కు ముందే సాక్షి నిర్వహించిన సదస్సు మా లక్ష్యాల ఛేదనకు ఎంతో దోహదం చేసేలా ఉంది. సదస్సులో చెప్పిన ప్రతి అంశం నాలో స్ఫూర్తిని రగిలించింది. ప్రయత్నిస్తే విజయం సాధిస్తామన్న నమ్మకం కలిగింది. 'సాక్షి' వారి మేలు మరువలేము. - మనోజ్

చక్కని మార్గదర్శకం




నేను గ్రూప్స్‌కు సిద్ధం కావాలని నిర్ణయించుకున్నా. గ్రూప్స్ పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలనే ఆలోచన ఉండేది. సాక్షి వారు నిర్వహించిన అవగాహన సదస్సు చక్కటి మార్గదర్శకతను చూపింది. మేడమ్ బాలలత అందించిన బోధనలు మాకు బాగా అవగతమయ్యాయి. పోటీ పరీక్షకు సన్నద్ధమయ్యే ధైర్యాన్ని ఇచ్చాయి. - లక్ష్మి

సమాధానం దొరికింది



యువత లక్ష్యాల పట్ల ఆకాంక్షను గుర్తించి సాక్షి వారు గ్రూప్స్ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించడం అభినందనీయం. ఈ సందర్భంగా సివిల్ విజేత అయిన మేడమ్ బాలలత అందించిన బోధన నా ఆకాంక్షను మరింత పెంచింది. విజయ సాధనకు చక్కటి స్ఫూర్తినిచ్చింది. నాలో కలిగే సందేహాలకు సమాధానం లభించింది. - తనూష

విలువైన సమాచారం తెలుసుకున్నా



తొలి సారిగా గ్రూప్ పరీక్షలు రాయాలనుకుని డిసైడ్ అయ్యాను. ఇప్పుడు దీనికి సాక్షి వారి అవగాహన సదస్సు విలువైన సమాచారం నాకు ఎంతో దోహదపడింది. మనోస్థైర్యాన్ని నింపింది. పరీక్షలకు హాజరయ్యే వారికి ప్రాథమికంగా ఉండే అనేక అపోహలు, సందేహాలను ఈ సదస్సు ద్వారా నివృత్తి చేశారు. సదస్సులో మేడమ్ అందించిన సూచనలతో పరీక్షలకు ముందుకు సాగుతాం. - పీ.శివకుమార్

సీఎం చొరవతోనే నియోజకవర్గ అభివృద్ధి



మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, బీజేపీ కార్యకర్తలు

రొంపిచెర్ల: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతోనే పుంగనూరు నియోజక వర్గాన్ని గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేశానని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆయన సోమవారం రొంపిచెర్ల మండలంలో రూ.10 కోట్లతో నిర్మించిన వివిధ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్ ఇచ్చేందుకు విద్యుత్ సబ్ స్టేషన్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, మురుగు నీటి కాలవలు నిర్మించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎన్ని పార్టీలు కలసి వచ్చినా మళ్లీ అధికారం వైఎస్సార్‌సీపీదేనని జోస్యం చెప్పారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను ఓటు అనే ఆయుధంతో ప్రజలు బంగాళాఖాతంలో కలిపేస్తారని చెప్పారు. ఇవే వారికి చివరి ఎన్నికలవుతాయని అన్నారు.

టీడీపీ, బీజేపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరిక

బండకిందపల్లె పంచాయతీలో టీడీపీ, బీజేపీ కార్యకర్తలు సోమవారం రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి మంత్రి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ ఉప సర్పంచ్ రెడ్డెప్ప, లోకనాథ, ప్రసాద్, శ్రీనివాస్, శశికుమార్, కార్తీక్, సంతోష్, పవన్‌కుమార్, వంశీ, నరేష్, శ్రావణ్, వేణు, వెంకటరమణ, రవి, దేవేంద్ర, శ్రీను, రమణ, అరుణకుమారి, వెంకటలక్ష్మి, కళావతి, సంధ్య, సౌజన్య, బాబుతోపాటు మరో 30 మంది కార్యకర్తలు ఉన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇబ్రహీంఖాన్, సింగిల్‌విండో చైర్మన్ హరినాథరెడ్డి, వైస్ ఎంపీపీ విజయశేఖర్, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా

త్వరలోనే ఆర్టీసీ ఉద్యోగులకు ప్రమోషన్లు



కండక్టర్లకు నగదు రివార్డు అందజేస్తున్న ఈడీ చెంగల్‌రెడ్డి

పలమనేరు: త్వరలోనే ఆర్టీసీలో ఉద్యోగులకు పదోన్నతులుంటాయని, ఇందుకు సంబంధించిన విధి విధానాలను ప్రభుత్వం రూపొందిస్తోందని ఇటీవల కడపజోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమితులైన చెంగల్‌రెడ్డి తెలిపారు. పలమనేరు డిపోను సోమవారం ఆయన సందర్శించారు. డిపో వద్ద విశ్రాంతి గదిని ఆయన ప్రారంభించారు. అనంతరం నవంబర్‌కు సంబంధించి అత్యధిక ఈపీకే సాధించిన కండక్టర్లు నాగరాజప్ప, భానుమతికి ఆయన అభినందించి, నగదు రివార్డులు అందజేశారు. అనంతరం డిపో సిబ్బందితో గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్గో సేవల పెంపుతో డిపో అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. పలమనేరు డిపో అభివృద్ధికి తప్పకుండా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా డిపో వైఎస్సార్‌సీపీ యూనియన్ అధ్యక్షుడు కేవీ రమణ, రీజినల్ వైస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, ఎంప్లాయీస్, ఎన్ఎంయూ సంఘాల నాయకులు నూర్‌బాషా, ఏవై రెడ్డి తదితరులు ఆయనకు పలమనేరు డిపో నుంచి ఎక్స్‌ప్రెస్ సర్వీసులను నడపాలని వినతి పత్రం అందజేశారు. ఈ విషయాన్ని తప్పక పరిశీలిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమాల్లో డీఎం కుల్లాయిస్వామి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఇంతి..కోటి దీప కాంతి



పూజల్లో పాల్గొన్న మంత్రి ఆర్కే రోజా



కోటి దీపోత్సవంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

మనసంతా శివపార్వతులను నింపుకుని.. దీపాలు వెలిగించి.. ఆ శోభ తమ జీవితాల్లో నిండాలని ఇంతులు వేడుకున్నారు. పుత్తూరు పట్టణంలో సోమవారం జరిగిన కార్తీక దీపోత్సవంలో మహిళలు వెలిగించిన కార్తీ జ్యోతి ఆధ్యాత్మిక దీప్తిగా పరిఢవిల్లింది.

- పుత్తూరులో వైభవంగా కోటి దీపోత్సవం
- మంత్రి ఆర్‌కే రోజా ప్రత్యేక పూజలు
- భక్తులతో కిక్కిరిసిన ఎస్ఆర్ఎస్ కళాశాల ప్రాంగణం

పుత్తూరు: పట్టణం ఆధ్యాత్మిక శోభతో పరిఢవిల్లింది. కార్తీకమాసం ఆఖరి సోమవారం నేపథ్యంలో స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన కోటి దీపోత్సవం వైభవంగా జరిగింది. పట్టణంలో వెలసిన శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వర స్వామి వారికి నిర్వహించిన కోటి దీపోత్సవంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఏటా స్వామివారి ఆలయ ప్రాంగణంలో జరిగే కార్తీక దీపోత్సవం ఈసారి భక్తుల రద్దీకి అనుగుణంగా కళాశాల మైదానంలో ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి. అందులోనూ కోటి దీపోత్సవం కావడంతో భారీ ఎత్తున తరలివచ్చిన మహిళలు కార్తీక జ్యోతులను ప్రజ్వలింపజేశారు. దీంతో ప్రతి ఒక్కరిలోనూ ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించింది.

ప్రత్యేక పూజల్లో మంత్రి రోజా..

పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా పుత్తూరులో జరిగిన కోటి దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొని, గణపతి హోమం, మహా మృత్యుంజయ హోమ పూజలు నిర్వహించారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ మూర్తులను పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి కొలువుదీర్చారు. వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అంతకుముందు గార్లపాటి ప్రభాకర్ శర్మ ఆధ్వర్యంలో కార్తీక మాస విశిష్టత ప్రవచన కార్యక్రమం నిర్వహించారు.



దీపాలు వెలిగించి, మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు



దీపోత్సవంలో ఏర్పాటు చేసిన ఓం ఆకారం చుట్టు వెలిగించిన దీపాలు

కార్తీక దీపం.. నయన మనోహరం



పుంగనూరు పుష్కరిణిలో కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

పుంగనూరు: పట్టణంలోని అన్నపూర్ణ కాశీవిశేశ్వర ఆలయ పుష్కరిణిలో కార్తీకమాసం చివరి రోజు సోమవారం రాత్రి హిందూజాగరణ సమితి ఆధ్వర్యంలో కార్తీక దీపారాధన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని వందలాది మంది మహిళలు కుటుంబ సభ్యులతో హాజరై హరహర మహాదేవ శంభోశంకర అంటు దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను హిందూజాగరణ సమితి ప్రతినిధులు త్రిమూర్తిరెడ్డి, పరమేష్, గంగాధర్, హరి, నాగరాజ, సురేష్, వెంకటేష్, చంద్ర, సునీల్, రాజేష్ , మధు, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కళాఉత్సవ్ పోటీలు



కళాఉత్సవ్ పోటీల్లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో విద్యార్థుల ప్రదర్శనలు చూపరులను అలరించాయి. డైట్ సీనియర్ అధ్యాపకుడు ప్రభాకర్ కళాఉత్సవ్ పోటీలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం కళా ఉత్సవ్ నిర్వాహక డైట్ అధ్యాపకులు నిర్మల, సునీత మాట్లాడుతూ సృజనాత్మకత, నైపుణ్యాలు, ప్రతిభను వెలికి తీసి ప్రోత్సాహించడానికి ఏటా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రభుత్వం కళా ఉత్సవ్ పోటీలు నిర్వహిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంత నేపథ్యం కలిగిన విద్యార్థులు జానపద, సంగీత, నాటక, ఏకపాత్రాభినయం పోటీల్లో గ్రామీణ ప్రాంత విద్యార్థులు చక్కటి ప్రదర్శనలివ్వడం అభినందనీయమన్నారు. 8 అంశాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు శ్రీనివాసులురెడ్డి, దేవప్రసాద్, మహ్మద్‌రఫీ, నాగరాజు నాయక్, అనిత, ఉపాధ్యాయులు గాజుల నాగేశ్వరరావు తదితర పాల్గొన్నారు.

లా నేస్తం..విజయ చిహ్నం

'సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మనసంతా హితమే..ఆపదల్లో తోడై..బాధలో ఓదార్పై..అన్ని వేళలా చెలిమిలా అన్ని వర్గాలకు అండగా ఉంటారు. యువ న్యాయవాదులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అందుకే వైఎస్సార్ లా నేస్తం పథకం అందిస్తున్నారు. అది వారి విజయానికి చిహ్నంగా నిలుస్తోంది.' అని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు.

- ప్రస్తుత విద్యానంవత్సరంలో రెండవ విడత లా నేస్తం ప్రారంభం
- వర్చువల్‌లో పథకాన్ని ప్రారంభించిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి
- కలెక్టరేట్‌లో ఘనంగా జిల్లాస్థాయి కార్యక్రమం
- పాల్గొన్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు
- జిల్లాలో 154 మంది యువ న్యాయ వాదులకు రూ.7.70 లక్షలు మంజూరు
- జిల్లాలోని లబ్ధిదారులకు మెగా చెక్కు పంపిణీ



లా నేస్తం లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం వైఎస్సార్ లా నేస్తం 2023-24 సంవత్సరానికి రెండో విడత పథకాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కార్యక్రమాన్ని ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ లా నేస్తం పథకం యువ న్యాయవాదులకు తొలి మూడేళ్ల అండగా ఉంటూ ఊతమిస్తోందన్నారు. దేశంలో ఎక్కడా ఇలాంటి పథకం అమలు కావడం లేదని చెప్పారు. లా పూర్తి చేసిన జూనియర్ న్యాయవాదులు వారి వృత్తిలో నిలదొక్కుకునేందుకు వారికి ప్రభుత్వం మూడేళ్ల పాటు ప్రోత్సాహకం అందిస్తోందన్నారు. ఈ పథకంలో అర్హులైన జూనియర్ న్యాయవాదులకు ప్రతి నెలా రూ.5వేల చొప్పున ఏడాదికి రూ.60 వేలు, మూడేళ్లకు రూ.1.80 లక్షలను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ఇన్‌చార్జి కలెక్టర్ పీ శ్రీనివాసులు మాట్లాడుతూ యువ న్యాయవాదులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు. జిల్లాలో జూన్ 2023 నాటికి 97 మంది, ప్రస్తుతం కొత్తగా దరఖాస్తు చేసుకున్న 57 మంది మొత్తం 154 మందికి ఈ ఏడాది రెండో విడతలో రూ.7.70 లక్షలను ప్రభుత్వం మంజూరు చేస్తోందని తెలిపారు. లా నేస్తం ప్రోత్సాహాన్ని యువ న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ జోనల్ చైర్మన్ శైలజారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ తులసి, మెప్మా పీడీ రాధమ్మ, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్, యువన్యాయవాదులు పాల్గొన్నారు. కాగా లా నేస్తం అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఆ సంతోషం వారి మాటల్లోనే..

గతంలో ఏ సీఎం మా గురించి పట్టించుకోలేదు



గతంలో ఏ సీఎం మా గురించి పట్టించుకోలేదు. నేను 2021లో లా గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను. ఏపీ హైకోర్టులో లా ప్రాక్టీస్ చేస్తున్నాను. వైఎస్సార్ లా నేస్తం పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా అందిస్తున్న రూ.5 వేలు నాకెంతగానో ఉపయోగపడుతోంది. రెండు విడతల్లో లబ్ధి పొందాను. యువన్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎంకు ధన్యవాదాలు.

- కోదండపాణి, జూనియర్ న్యాయవాది, ఎస్ఆర్ పురం మండలం

ఆర్థిక తోడ్పాటునందిస్తున్నారు



వైఎస్సార్ లా నేస్తం పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటునందిస్తోంది. నేను చిత్తూరు బార్ అసోషియేషన్‌లో ఒకటన్నర సంవత్సరంగా లా ప్రాక్టీస్ చేస్తున్నాను. నాకు లా కోర్సు చదివే సమయంలో విద్యాదీవెన పథకం అందేది. ప్రస్తుతం లా నేస్తం అందుతోంది. ఈ పథకం నాకెంతో ఉపయోగపడుతోంది. ప్రతి పేదవాడిని ఆదుకునేలా సీఎం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు.

- కోమల, జూనియర్ న్యాయవాది, సంతపేట, చిత్తూరు

సీఎంకు ధన్యవాదాలు



జూనియర్ లాయర్లందరి తరుపున సీఎంకు ధన్యవాదాలు తెలుపుతున్నా. నేను చిత్తూరు కోర్టులో లా ప్రాక్టీస్ చేస్తున్నాను. నేను రెండో విడతగా లా నేస్తం పథకం ద్వారా లబ్ధి పొందుతున్నాను. ఈ పథకం అమలుపై నాతోపాటు ప్రాక్టీస్ చేస్తున్న జూనియర్ లాయర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జూనియర్ లాయర్లకు సహాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ఏ ఇతర రాష్ట్రంలోనూ లేదు. ఏపీలో మాత్రమే మా లాంటి యువ లాయర్లకు ఈ అవకాశం దొరికిందంటే ఇది మా అదృష్టం.

- మోహిద్దీన్, జూనియర్ న్యాయవాది, చిత్తూరు నగరం

జగనన్నకు రుణపడి ఉంటాం



మా సంక్షేమం కోసం లా నేస్తం పథకాన్ని అమలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. నేను పుత్తూరు కోర్టులో జూనియర్ లాయర్‌గా ప్రాక్టీస్ చేస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లా నేస్తం పథకం అందుతోంది. ఆ ప్రోత్సాహక నగదు నాకెంతగానో ఉపయోగపడుతోంది. గతంలో యువ న్యాయవాదుల సంక్షేమం గురించి ఎవరూ పట్టించుకోలేదు.ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే లా నేస్తం అమలు చేసి ఏటా రెండు విడతల్లో పథకం లబ్ధి అందజేస్తున్నారు. సీఎంకు ధన్యవాదాలు.

- మహేశ్వరి, జూనియర్ లాయర్, కార్వేటినగరం మండలం

యూడైస్ ప్లస్ డేటా ప్రక్రియ చేపట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలలు, కళాశాలల్లో యూడైస్ ప్లస్ డేటా ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని డీఈఓ విజయేంద్రరావు ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బాలాజీకాలనీలో ఉన్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో డీవైఈఓ, ఎంఈఓలతో సమావేశం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు యూడైస్ ప్లస్ ప్రక్రియను జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ఈ కసరత్తు విషయంలో అలసత్వం వహించకూడదని తెలిపారు. ఆయా మండలాల ఎంఈఓలు ప్రక్రియను పర్యవేక్షించాలని చెప్పారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి చేపడుతున్న ఈ ప్రక్రియలో టీచర్లు, విద్యార్థులు, మిగిలిన వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. తప్పుడు వివరాలను నమోదు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా 2,999 పాఠశాలలు, కళాశాలల్లో ప్రక్రియను నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 26వ తేదీలోపు కసరత్తు పూర్తి చేయాలని ఆదేశించారు. డీవైఈఓ చంద్రశేఖర్, ఎంఈఓలు సెల్వరాజ్, మోహన్ పాల్గొన్నారు.

ఏనుగుల హల్‌చల్



బాలేంద్రపల్లెలో రోడ్డు దాటుతున్న ఏనుగులు

వి.కోట: మండలంలో పలు గ్రామాల్లో 14 ఏనుగులు ఆదివారం రాత్రి హల్‌చల్ చేశాయి. పలువురి రైతులకు సంబంధించిన పంటలను తొక్కి నాశనం చేశాయి. మండలంలోని దానమయ్యగారిపల్లె, కుమ్మరమడుగు, మిట్టూరు, నక్కనపల్లె, మోట్లపల్లె, బాలేంద్రపల్లె, వెర్రినాగేపల్లె తదితర గ్రామాల్లో రైతులు సాగు చేసిన వివిధ పంటలపై దాడి చేసి, తొక్కినాశనం చేశాయి. రూ.లక్షల నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మోటారు సైకిళ్ల చోరీ ముఠా అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

పుత్తూరు: మోటారు సైకిళ్ల చోరీ ముఠాను అరెస్టు చేసినట్లు పుత్తూరు డీఎస్పీ వై.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఈ విషయాలను డీఎస్పీ వెల్లడించారు. పుత్తూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో జరుగుతున్న మోటారు సైకిళ్ల చోరీలను అరికట్టేందుకు సీఐ లక్ష్మీనారాయణ నేతృత్వంలో వడమాలపేట, పుత్తూరు ఎస్ఐలు రామాంజనేయులు, వెంకటమోహన్, క్రైమ్ బ్రాంచ్ ఏఎస్ఐ రాజాలతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. సోమవారం తెల్లవారుజామున పక్కా సమాచారం మేరకు పుత్తూరు-నగరి రోడ్డులోని నందిమంగళం, మరాఠీ గేటు వద్ద రెండు పోలీసు బృందాలు వాహనాల తనిఖీ చేపట్టాయి. అదే సమయంలో ద్విచక్ర వాహనం చోరీకి పాల్పడి నగరి వైపు వెళుతున్న ఐదుగురు సభ్యుల ముఠాను అదుపులోకి తీసుకుని, విచారించగా వరుస చోరీల గుట్టు బయట పడింది. దీంతో రూ.10 లక్షలు విలువ చేసే 13 మోటారు సైకిళ్లతోపాటు ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగరి మండలం తడుకు పేట గ్రామానికి చెందిన దేవేంద్ర(22), హరి(23), కీలపట్టు దళితవాడకు చెందిన నరేష్ బాబు(29), పుత్తూరు మండలం ఉత్తరపుకండ్రిగకు చెందిన మార్టిన్(23), రేవంత్‌కుమార్(22)ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. చోరీ ముఠాను అరెస్టు చేసిన సీఐ లక్ష్మీనారాయణ బృందాన్ని అభినందించి, డీఎస్పీ శ్రీనివాసరావు నగదు రివార్డును అందజేశారు.

వాహనం ఢీ కొని వ్యక్తి దుర్మరణం

చిత్తూరు అర్బన్: నగరంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మునినారాయణ శెట్టి (69) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని బజారు వీధికి చెందిన మునినారాయణ శెట్టి ఓ దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఉదయం గాంధీ విగ్రహం వద్ద రోడ్డు దాటుతుండగా మ్యాక్సీకాబ్ ఆయన్ని ఢీ కొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితుడ్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చీలాపల్లె వద్ద ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ జయప్ప తెలిపారు.